ఆహ్లాదం కనుమరుగు!



ఒకప్పుడు జిగేల్‌మంటూ మెరిసిన వాటర్ ఫౌంటైన్ (నాడు)

నాడు కనువిందు

విశాఖ నగరానికి ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ స్వాగత ద్వారంగా నిలుస్తోంది. సమీపాన ఉన్న ఎయిర్‌పోర్టులో దిగిన వారు అదే విధంగా హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాల నుంచి రోడ్డు మార్గాన వచ్చే వారంతా ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ దాటి విశాఖ నగరంలోకి ప్రవేశించాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఫ్లైఓవర్‌తో పాటు దిగువ భాగంలో అందాలు కనువిందు చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నలు వైపులా పూల మొక్కలు నాటారు. వాటి సంరక్షణ ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. ఫుట్ బ్రిడ్జికి అనుసంధానంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి మధ్యలో వాటర్ ఫౌంటైన్ అమర్చారు. ఇది చూసిన వారికి, ఇదో సినిమా సెట్టింగ్ లా ఉండేది. ప్రయాణికులు అక్కడ సెల్ఫీ తీసుకోవడానికి పోటీపడేవారు



నాచుపట్టిన ఫౌంటైన్‌లోని నీరు (నేడు)

- ఎండిపోతున్న మొక్కలు
- అలంకార ప్రాయంగా వాటర్ ఫౌంటైన్
- చోరీకి గురవుతున్న సామగ్రి
- ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ కింద జోరుగా ఆక్రమణలు



చోరీకి గురైన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి రెయిలింగ్

విశాఖ విద్య: నగరానికి తలమానికంగా నిలిచి ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ నిర్వహణను గాలికి వదిలేశారు. ఫ్లైఓవర్ దిగువ భాగంలో ప్రజలకు ఆహ్లాదం పంచేలా ఏర్పాటు చేసిన ఫౌంటైన్ మూలకు చేరింది. పచ్చదనం కనుమరుగవుతోంది. నీరుపోసే నాథుడు లేక మొక్కలు ఎండిపోతున్నాయి. చిల్లర దొంగలు దొరికిందంతా దోచుకుపోతున్నారు. ఫ్లై ఓవర్ కింద పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్ వే బ్రిడ్జికి సంబంధించిన ఇనుప సామగ్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

నేడు నిర్లక్ష్యం

ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ నిర్వహణను ఇటు కూటమి పాలకులు.. అటు వీఎంఆర్డీఏ అధికారులు గాలికొదిలేశారు. నగర పాలక సంస్థ పెద్దలు సైతం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం మొక్కలు ఎండిపోతున్నాయి. మరి కొన్ని మొక్కలు నడక దారిలో అడ్డంగా ఉన్నా వాటిని తొలగించే వారు లేకుండా పోయారు. వాటర్ ఫౌంటైన్ మూలకు చేరడంతో రాత్రి వేళ మందుబాబులు అక్కడి చేరి మద్యం సేవిస్తున్నారు. ఇటీవల ఆ ప్రాంతంలో పర్యటించిన వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ దృష్టికి మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఫ్లై ఓవర్ వద్ద నెలకొన్న సమస్యలను వివరించారు. వాటర్ ఫౌంటైన్ వద్దకు తీసుకెళ్లి చూపించారు. కానీ, కూటమి పెద్దలు మాత్రం సౌకర్యాలు మెరుగు పరచనీయకుండా అడ్డుపుల్ల వేస్తున్నారని ప్రజానీకం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



వాటర్ ఫౌంటైన్ వద్ద మద్యం సీసాలు



ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్

ఫుట్‌వే బ్రిడ్జిపై పొంచిన ఉన్న ప్రమాదం

ఫుట్ వే బ్రిడ్జిపై నడక సాగించేటప్పుడు ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోకుండా రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ రెయిలింగ్ చోరీకి గురవుతోంది. దీంతో చేతితో పట్టుకునేందుకు రెయిలింగ్ లేకపోవటంతో గ్రత్తగా నడకసాగించకపోతే కింద పడే ప్రమాదం ఉందని వృద్ధులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణల జోరు

ఇటీవల ఫ్లై ఓవర్ కింద ఆక్రమణల పరంపర కొనసాగుతోంది. కంటైనర్ మాదిరే ఉండే వాటిని రాత్రికి రాత్రే తీసుకొచ్చి పెట్టి దర్జాగా వ్యాపారాలు చేస్తున్నారు. ఒక్కో దుకాణదారుడు నుంచి కూటమికి చెందిన ఓ నాయకుడు రూ. 30 నుంచి రూ. 50 వేలు వసూలు చేస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. ఇలాంటి ఆక్రమాలు సాగవనే ఉద్దేశంతోనే ఫ్లై ఓవర్ ఏరియాను అభివృద్ధి చేయనీయకుండా కూటమి నేతలు అడుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



ఎండిపోయిన మొక్కలు



పేరుకుపోయిన వ్యర్థాలు

క్లుప్తంగా

రజకుల కాలనీకి యూజీడీ సౌకర్యం



పనులను ప్రారంభిస్తున్న అధికారులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52 వ వార్డు వుడా లే అవుట్‌లోని రజకుల కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సౌకర్యం కల్పించేందుకు శుక్రవారం యూజీడీ విభాగం ఏఈ సుమన్ పనులను ప్రారంభించారు. మద్రిపాలెం వుడా లే అవుట్‌లో ఉన్న యూజీడీ పైపులైన్‌కు రజకుల కాలనీ వాడుక నీరు చేరేలా పనులు చేపట్టేందుకు నిధులు మంజూరైనట్లు వైటీఆర్ తెలిపారు. కార్యక్రమంలో సన్యాసి రావు, పెద్దలు వాసుదేవరావు, పీటీ నాయుడు పాల్గొన్నారు.

ఆర్‌పీలకు ట్యాబ్‌ల పంపిణీ



ఆర్‌పీలకు ట్యాబ్‌లు అందిస్తున్న విప్ గణబాబు

గోపాలపట్నం: రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లను ప్రభుత్వ విప్ గణబాబు శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధాన కర్తలుగా ఆర్‌పీలు వ్యవహరించాలని ఆయన సూచించారు. జోన్–8 పరిధిలోని 89, 90, 91, 92 వార్డుల్లో మొత్తం 65 ఆర్‌పీలు ఉండగా 63 మందికి ట్యాబ్‌లు అందించారు. కార్యక్రమంలో జోన్–8 కమిషనర్ హేమావతి, ఏపీడీ చిరంజీవి, కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత

విశాఖ విద్య: ఫిషింగ్ హార్బర్ దగ్గర చనిపోయిన వ్యక్తికి బంధువులు ఎవరూ లేకపోవడంతో మమత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎల్లేటి మమత శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. వన్‌టౌన్ ఏరియాలోని హార్బర్ దగ్గర మృతి చెందిన వ్యక్తి శవానికి కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. నాలుగు రోజుల నుంచి ఎదురు చూస్తున్నా ఈ వ్యక్తి కోసం కుటుంబ సభ్యులు ఎవరూ రాలేదు. అనాథ శవానికి అంత్యక్రియలు నిమిత్తం వన్‌టౌన్ పోలీసులు మమత చారిటబుల్ ట్రస్ట్‌కి సమాచారం ఇచ్చారు. ట్రస్ట్ ఫౌండర్ ఎల్లేటి మమత ప్రత్యేక చొరవ తీసుకొని పోలీసుల సహకారంతో కేజీహెచ్ నుంచి మృతదేహాన్ని తీసుకొచ్చి జ్ఞానాపురం శ్మశాన వాటిలో శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు.మమతకు పలువురు అభినందనలు తెలిపారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న జెడ్సీ రాము

మల్కాపురం: అంతరూ తాము నివసిస్తున్న ఇల్లు, పరిసర ప్రాంతాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని జోన్–5 జెడ్సీ రాము సూచించారు. మల్కాపురం మలేరియా విభాగం అధికారుల ఆధ్వర్యంలో 59వ వార్డు హనుమాన్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజు డ్రై డే పాటించాలని సూచించారు.

కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తాం



కార్యక్రమంలో పాల్గొన్న యాదవ సంఘం ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు పవన్‌పుత్ర కాలనీ వద్ద గల వేణుగోపాల స్వామి ఆలయంలో వచ్చే నెల 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తామని యాదవ సంఘం ప్రతినిధి వియ్యపు సన్యాసిరావు యాదవ్ తెలిపారు. వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన యాదవ సంఘం ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరవై సంవత్సరాలుగా ఇక్కడి మందిరంలో స్వామి వారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా అదేరీతిలో ఉత్సవ నిర్వహణ ఉంటుందని తెలిపారు. వేడుకల పోస్టర్‌ను త్వరలో విడుదల చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక యాదవ సంఘం ప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది సేవలు భేష్



సింహాచలం ఆర్టీసీ డిపోలో మాట్లాడుతున్న ఆర్‌ఎం అప్పలనాయుడు

గోపాలపట్నం: సింహాచలం గిరి ప్రదక్షిణలో భక్తులకు సేవలు అందించిన ఆర్టీసీ సిబ్బందిని రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు అభినందించారు. ఈ మేరకు శుక్రవారం సింహాచలం ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులను తరలించడంలో ఏపీఎస్ ఆర్టీసీ కీలక పాత్ర పోషించిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారని తెలిపారు. సింహాచలం కొండ నుంచి తొలి పావంచా వరకు 55 బస్సులు, మిగతా ప్రాంతాలకు 150 బస్సులు తిప్పామని తెలిపారు. ఎక్కడా ఎవరికి ఇబ్బంది కలగకుండా సేవలు అందించిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, కండక్టర్లతో పాటు మెకానిక్‌లకు అవార్డులు ప్రకటించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శరత్, అసిస్టెంట్ మేనేజర్ రమణమూర్తి, ఏఈలు సుధారాణి, కొండలరావు, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి



అతిథులను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

మల్కాపురం: చిన్న వయసు నుండే పిల్లలు ఇంటర్నెట్ ఉపయోగించడం వలన సైబర్ నేరాల సంఖ్య పెరుగుతోందని మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు వై.అనసూయాదేవి అన్నారు. తల్లిదండ్రులు ఈ విషయంలో పిల్లలకు సరైన మార్గదర్శకత్వం అందించాలని కోరారు. సైబర్ నేరాలపై సెయింట్ ఆన్స్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లలు ఎటువంటి కార్యక్రమాలను, యాప్‌ను అనుసరిస్తున్నారో తల్లిదండ్రులు కనిపెడుతూ ఉండాలన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. పిల్లల ప్రవర్తనలో ఏ మాత్రం తేడా ఉన్నా వారిని దారిలో పెట్టే విధంగా తల్లిదండ్రులు నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అధ్యాపకులను, అతిథులను కళాశాల యాజమాన్య సత్కరించింది.

రోడ్డెక్కిన మురుగు



కాలువ నుంచి రోడ్డు పైకి ప్రవహిస్తున్న మురుగు నీరు



మురుగు నీటితో చెరువును తలపిస్తున్న రోడ్డు

గోపాలపట్నం: మురుగు నీరు రోడ్డుపైకి ఎక్కింది. దీంతో స్థానికులు పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. బాజీ జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం బీఆర్‌టీఎస్ రోడ్డులో మురుగు నీరు వరదలా ప్రవహించింది. ఈ ప్రవాహం విజేతా సూపర్ మార్కెట్ దాటి సాగింది. ఫుట్ పాత్ డక్టుల్లో వ్యర్థాలు పేరుకు పోవడం వల్ల మురుగు వెళ్లలేని పరిస్థితి ఏర్పడడంతో రోడ్డుమీదకు వచ్చిందని చెబుతున్నారు. డక్టుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, సీసాలు భారీగా పేరుకు పోయాయని ..వీటిని తొలగించాలని పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల గోపాలపట్నం ఖజానా దుకాణం వద్ద ఇదే మాదిరిగా మురుగు నీరు రోడ్డు పైకి రావడంతో ఏఎంహెచ్‌వో దగ్గరుండి డక్టుల్లో మురుగును తీయించారు. ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కాని ఆ పనులు జరగక పోవడంతో మళ్లీ బాజీ జంక్షన్ వద్ద ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు విమర్శిస్తున్నారు.

రైతుబజారులో టీబీపై అవగాహన



రైతుబజారులో టీబీపై అవగాహన కల్పిస్తున్న యూనిట్ సభ్యులు

గోపాలపట్నం: టీబీ ముక్తభారత్ అభియాన్‌లో భాగంగా గోపాలపట్నం రైతు బజారులో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి టీబీ యూనిట్ హెచ్ఎస్ సీహెచ్ కనకారావు రైతులకు సూచనలు చేశారు. 46మంది రైతులకు కఫ పరీక్షలు చేశారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సభ్యులు వి.శ్రీనివాసరావు, జి.వెంకటరమణ, జి.కరుణ, వెంకటరావు, యూపీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, రైతు బజారు ఈవో జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దని ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులపేట రైల్వేగేటు సమీపంలోని పైడిమాంబ ఆలయం వద్ద మద్యం దుకాణం గురువారం అర్ధ రాత్రి హడావుడిగా ఏర్పాటు చేశారు. ముహూర్తం చూసుకుని ప్రారంభించి శుక్రవారం ఉదయం మూసివేశారు. సాయంత్రం చీకటి పడిన తర్వాత దుకాణం తెరడంతో ఆయా గ్రామాల పెద్దలు,ప్రజలు నిరసన తెలిపారు. మద్యం దుకాణానికి 100 మీటర్ల దూరంలో పైడిమాంబ అమ్మవారి దేవాలయం, 500 మీటర్ల వద్ద బడి ఉండడంతో వైన్ షాప్‌కు పర్మిషన్ రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ అధికారులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. గవరకంచరపాలెం, దయానందనగర్, చాకలిగెడ్డ, రాజీవ్‌కాలనీ, పైడిమాంబ కాలనీ, ముత్యమాంబకాలనీ, ఆర్‌ఏపేట ప్రజలు ధర్నా చేపట్టడంతో పోలీసులు మోహరించారు. మద్యం దుకాణం తరలించకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని ఆయా గ్రామాల పెద్దలు, మహిళలు తెలిపారు.

స్మార్ట్ మీటర్లు పెట్టనివ్వకండి

- ఇంటికి ఎవరు వచ్చినా తిప్పి పంపించండి
- సీపీఎం నాయకుల పిలుపు

మల్కాపురం: ప్రతి ఇంటికి విద్యుత్ స్మార్ట్ మీటర్లను అమర్చి, ప్రజలపై అదనపు భారం మోపేందుకు కూటమి సర్కార్ అడుగులు వేస్తోందని సీపీఎం నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, పెంటారావు తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు ఇంటికి ఎవరు వచ్చినా తిప్పి పంపించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న మీటర్లతో ఇప్పటికే అధిక విద్యుత్ చార్జీల భారం మోస్తున్న ప్రజలను స్మార్ట్ మీటర్ల పేరిట మరింత ఆర్థిక ఇబ్బందులకు గురి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించడం బాధాకరమన్నారు. అదాని సంస్థకు చెందిన ఈ స్మార్ట్ మీటర్లను ఒక్కసారి ఇంటికి అమర్చుకుంటే, ఇక ప్రతి నెలా చార్జీల మోత తప్పదన్నారు. ఇప్పటికే ఈ మీటర్లను అమర్చుకున్న వారి ఆవేదన చూస్తే చాలా బాధాకరంగా ఉందని, దీనిని ప్రజలు గ్రహించి అప్రమత్తమవ్వాలని సూచించారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను ఒక్క పైసా కూడా పెంచమని నమ్మబలికిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరు మృతి



అశోక్ రెడ్డి(ఫైల్)

గోపాలపట్నం: శీలానగర్ నుంచి పోర్టుకు వెళ్లే దారిలో మారుతీ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎయిర్‌పోర్ట్ పోలీసులు వెల్లడించిన వివరాలివి. పరవాడ మండలం గొర్లైవానిపాలేనికి చెందిన ముచల అశోక్ రెడ్డి (45) ద్విచక్రవాహనంపై విధులు నిర్వహించేందుకు వెళ్తుండగా, మారుతీ జంక్షన్ వద్ద వెనుకనే వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో అశోక్ అదుపుతప్పి లారీ ముందు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతను జేడీ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అశోక్‌కు భార్య లలిత, కుమార్తె హస్వినిత, కుమారుడు వహినాథ్ రెడ్డి ఉన్నారు. సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్ట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేపట్టారు.

పరిశోధనల నాణ్యతలో రాజీ వద్దు




శతాబ్ది వాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏయూ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

విశాఖ సిటీ: పరిశోధనల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అకడమిక్ సెనేట్ మందిరంలో ప్రారంభమైన 'శతాబ్ది వాణి' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరిశోధనల్లో నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పరిశోధకులు స్వీయ ప్రేరణతో ముందుకు సాగాలని అన్నారు. పరిశోధన గ్రంథ రచనను సరళంగా, సులభంగా, ఆసక్తిదాయకంగా ఎలా చేయాలో వివరించారు. డీన్ ఔట్రీచ్ ఆచార్య కె.రమాసుధ మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విభిన్న రంగాల నిపుణులను విశ్వవిద్యాలయానికి ఆహ్వానిస్తున్నామని, దీని ద్వారా విద్యా సంబంధిత వాతావరణం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ నెల 17న రెండో 'శతాబ్ది వాణి' ప్రసంగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య గిరిజాశంకర్, ఆచార్య పద్మశ్రీ, ఆచార్య సీతామాణిక్యం, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఆనందగజపతిరాజు, బ్రాండింగ్ అండ్ మీడియా అసోసియేట్ డీన్ డాక్టర్ సాల్మన్ బెన్నీ సహా పలువురు విభాగాధిపతులు, పరిశోధకులు పాల్గొన్నారు.

కోల్‌ఫీల్డ్స్ అధికారులకు ఐఐఎంవీలో ముగిసిన శిక్షణ



మహానది కోల్డ్‌ఫీల్డ్ లిమిటెడ్ అధికారులకు శిక్షణ ఇస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎం విశాఖపట్నం (ఐఐఎంవీ)లో మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌కు చెందిన 21 మంది అధికారులకు నిర్వహించిన అభివృద్ధి శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న వాల్తేరు డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక వాతావరణంలో అనుకూల నాయకత్వం ఆవశ్యకతను వివరించారు. ప్రభుత్వ రంగంలో భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే నాయకులను తీర్చిదిద్దేందుకు ఐఐఎంవీ చేస్తున్న కృషిని అభినందించారు. నిర్వహణ సామర్థ్యాలను, నాయకత్వ ప్రభావాన్ని బలోపేతం చేయడమే ఐఐఎంవీ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ శిక్షణలో నెగోషియేటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, కార్పొరేట్ ఫైనాన్స్, జెండర్ సెన్సిటైజేషన్, నాయకత్వ దృక్పథాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం డైరెక్టర్లు ప్రొఫెసర్లు ఎంవీ అనురాధ, బిషాఖా మంజుదార్ తదితరులు పాల్గొన్నారు.